# ద్రౌపదీ వస్త్రాలయం

"నార్థహాన్ సెంటర్లో కొత్తగా బట్టలు షాపొకటి పెట్టేరటగా. ఈ మారు పండక్కి అక్కడ కొందామండీ బట్టలు- " అంది జానకి.

"ఏ బండ అయితేనేం బుర్ర బద్దలు కొట్టుకోడానికీ - ఎక్కడ కొన్నా అవే బట్టలూ.... అదే ఖర్చూ... అప్పుడే ఏం పండగ. చూద్దాంలే" అన్నాడు సుందరం.

"మీకలాగే ఉంటుంది... వసంతమ్మ గారప్పుడే అడగనే అడిగింది పండక్కి బట్టల్తీసేరా అని-"

"తియ్యడమేమిటి? కొన్నారా అని అడగొచ్చుగా. వెనకటికి ఓ చేనేతబట్టలషాపు వాడు మా కంపెనీ వాళ్ళతో కంపెనీ వర్కర్లకు బట్టలు ఇన్‌స్టాల్‌మెంట్ మీద యిచ్చే ఒడంబడిక కుదుర్చుకుని కంపెనీ ఏరియా లోనే ఓ స్టాల్‌పెట్టి, 'పండక్కి ఇన్‌స్టాల్‌మెంట్ల మీద బట్టలిప్పించ బడును' అనే బోర్డు పెట్టేడు. అంతే! లేడీ ఎంప్లాయిస్ ఒక్కరైతే ఒట్టు! ఎందుకో చెప్పుకో!"

"తెల్సులెండి సంబడం. రెండర్థాల సినిమా పాటలు విని వినీ మీలాంటి వాళ్ళు ఆ రెండో అర్థం లాగి ఉంటారు - ఇంతకీ బట్టలు కొనేదెప్పుడూ?"

"కొందాంలే. అయినా అందరికీ కొనాలా యీ మారు?"

"ఇంట్లో వున్న నలుగుర్లోనూ యిద్దరికి కొని ఇద్దరికి మానేస్తారేమిటి? సంవత్సరంలో ఒక్కసారొచ్చే పండగ. మా చిన్నతనంలో అయితే....."

"ఆ పాపు. తెలుగు వాళ్ళకి పండగలకేం కొదవ? అయినా జానకీ, నాకు తెలీక అడుగు తానూ ప్రతి పండక్కీ బట్టలు కొనుక్కుని ఏం చేస్తాం చెప్పు?"

"బాగానే వుంది మీ ప్రశ్న. ఏం చేస్తాం. కట్టుకుంటాం"

"అది కాదు నా ప్రశ్న. అన్నేం చేసుకుంటామని. ఇప్పటికే రెండు బీరువాల్లోని ఎనిమిది

అరల్లో బట్టలు నిండిపోయివున్నాయి. మాసిన బట్టల బుట్ట ఎప్పుడు చూసినా నిండు గర్భిణీలానే ఉంటుంది. ఇంకా పిల్లల బట్టల స్టాండూ, నా హేంగర్స్ రాడ్డూ అన్నీ బట్టలతోనే నిండి ఉంటాయి. కొన్ని పాతవైపోతే తీసేసి అప్పుడు కొత్తవి కొనుక్కోకూడదూ?"

"కూడదు. మీరు కావలిస్తే మానేయండి. మాకు మాత్రం కొనక తప్పదు. తిన్నదెవరూ చూడరు. పండక్కి బట్టలు కొనుక్కోకపోతే అడుగుతారు"

మరోమాట మాట్లాడకుండా లేచి ఆఫీసుకు బయల్దేరాడు సుందరం. రోజూ ఆరు గంటలకు వచ్చేవాడు ఆ రోజు కాస్త ఆలస్యంగా వచ్చేడు - కొన్ని విషయాల్లో జానకి సహనశీలి. ఉగాదికి అతగాడు యిష్టపడి కొన్న తెల్ల పువ్వుల చీర కట్టుకొచ్చి కాఫీ అందిస్తూ పక్కన కూర్చుని టీవీ రిమోట్ ఆన్ చేసింది.

"చూశారా. పేపర్లలోనూ టీవీలోనూ ఎలా వూదరగొట్టేస్తున్నాడో" అంది

"ఎవడు వాడు?"

"పొద్దున్న నేను చెప్పలా. ఆ బట్టల షాపు వాడు. చూడండి చూడండి. ఆ మూడంతస్తుల మేడ, ఆ రంగురంగుల బట్టల అలంకరణ. వచ్చే వాళ్ళకి కూల్‌డ్రింక్స్‌ట - గుమ్మంలో సలాములు చేసే జవాన్లట. బయట కంటే తక్కువ ధరలకే బట్టలిస్తున్నాడట"

"అవన్నీ నువ్వు నమ్ముతున్నావా? అలా యిస్తే మూడంతస్తులూ మూడు రోజుల్లో అమ్ముకుని పోతాడు. ఈ వూరి జనాలకి బట్టల పిచ్చి ఎక్కువ. అది వాడు కనిపెట్టి సొమ్ము చేసుకుంటున్నాడు"

"పోనీ అలాగే అనుకోండి. తిండికీ బట్టకీ కాకపోతే సంపాదించు కున్నదెందుకూ? మనిషి రూపురేఖల్ని మార్చేసేది కట్టుకున్న బట్టే. దాన్ని బట్టే యిప్పుడు మనిషికి విలువ కూడానూ"

జానకి చేతిలోని రిమోట్ తీసుకుని ఛానల్ మార్చేడు సుందరం. బండ మొహాలతో డబ్బింగ్ సీరియల్ ఏదో వస్తోంది. ఆరొందల ఏభై రెండో ఎపిసోడట. కథ ఎక్కడ్నించి ఎక్కడికి సాగుతుందో ఎవరు ఎప్పుడు కనుమరుగైపోతున్నారో, ఎవరు కొత్తగా వస్తున్నారో అంతా అగమ్యగోచరంగా వుంది. జానకి ఒకట్రెండుసార్లు కథ చెప్పబోయింది గాని తనే విన్లేదు.

"ఎప్పుడు వెళ్దాం. ఇవాళా రేపా?" అడిగింది మళ్ళీ.

"బాగుంది. వసంతమ్మ మొగుడులా నాకూ రెండో చేతి సంపాదన వుందనుకున్నా వేమిటి ఎప్పుడు బడితే అప్పుడు షాపింగులూ జల్సాలూ చేయడానికి. అతగాడిని ప్రజలు ఎలా తిట్టుకుంటున్నారో తెల్సా? బట్టలేసుకుని తిరిగితే సరా" - టాపిక్‌ని పక్కదారి పట్టించడానికి ప్రయత్నించేడు.

"ఇవాళ మీ కంపెనీ వాళ్ళకి పండగ ఎడ్వాన్సు యిస్తున్నారటగా. చిన్న పేపర్లో వేశారు. నేను చూళ్ళేదనుకున్నారా?" అంది జానకి తెలివిగా.

"ఏ న్యూసూ దొరక్కపోతే యిలాంటివే వేసేస్తున్నారు వాళ్ళు. అవి చూసి అటు షాపుల్లోనూ ధరలు పెంచేస్తున్నారు. ఇటు ఇంట్లోనూ గొంతులు పెంచేస్తున్నారు. మధ్య తరగతి మానవుడేం

అయిపోవాలి?"

"పోన్లెండి ఇప్పుడైతే మరీ రద్దీగా ఉంటుంది. రేపు మధ్యాహ్నం మీరు పర్మిషనో సెలవో పెట్టి వచ్చేరంటే ఎంచక్కా తీరిగ్గా కొనుక్కోవచ్చు. ఈ లోగా పిల్లలకి కూడా ఎలాంటివి కావాలో అడిగేస్తే సరి" అని, మరో మాటకు తావివ్వకుండా లేచి వెళ్ళిపోయింది జానకి.

మర్నాడు మధ్యాహ్నం సెలవు పెట్టి మూడు గంటలకే వచ్చేడు సుందరం. పకోడీలు పెట్టి టీ యిచ్చింది జానకి. పిల్లలకి పొద్దున్నే చెప్పేరేమో ఇంటి తాళాలు పక్కింటి వారికిచ్చి నాలుగు అవుతుండగా బయల్దేరు జానకీ, సుందరం.

ఆ కొత్త బట్టల షాపు నూర్జహాన్ సెంటర్లో అని తెల్సుగాని సరిగ్గా అదెక్కడో తెలీదు సుందరానికి. అన్ని షాపులూ అయోధ్యా నగర్ సెంటర్లో వుంటే యిది మాత్రం దూరంగా ఉంది. అదీ ఒకందుకు మంచిదే అనుకున్నాడు.

అయోధ్యా నగర్ సెంటర్లోని ఏ షాపు కెళ్ళాలన్నా స్కూటర్ ఒక కిలోమీటర్ దూరంలో ఎక్కడో ఏ పాడు బడ్డ గోడ పక్కనో చీకట్లో దొంగ సామాను దాచుకునే వాడిలా ఆపాలి. అలా కాకుండా రోడ్డు మీద ఏ షాపు ముందు పార్కు చేసినా ట్రాఫిక్ పోలీసులు ఫైన్ వేస్తారు.

ఎందుకైనా మంచిదని నూర్జహాన్ సెంటర్కి అల్లంత దూరంలోనే స్కూటర్ని ఆపాడు సుందరం.

"అదిగో అదే – అద్దాలతో ఎలా మెరిసిపోతుందో చూడండి" అంది జానకి.

"అద్సరే. అక్కడేదో కొట్లాట జరుగుతున్నట్లుంది. కాసేపాగి వెళ్దాం" అన్నాడు సుందరం.

ఆ మాటకి ఆ పక్కనే వున్న ఆటోస్టాండులోని ఓ ఆటోడ్రైవర్ నవ్వి, "అది కొట్లాట కాదండి. షాపు తెరిచి మూణ్ణెల్లయినా రద్దీ తగ్గలేదు. బట్టలు వూరికే యిచ్చేస్తున్నట్టే జనం యిరగబడిపోయి అద్దాలు యిరగ్గొట్టేస్తుంటే ఆడు మాత్తరం ఏంజేస్తాడు. జవాన్లని పెట్టి లాఠీఛార్జి చేయించేస్తున్నాడు. ఎంతటోడైనా అక్కడ క్యూ కట్టాల్సిందే" అన్నాడు.

"మరి అదేమిటక్కడ? సర్కస్సా" అంది జానకి ఆశ్చర్యంగా.

ఆటో డ్రైవర్ మాయల ఫకీర్లా నవ్వి, "అదాండీ. సరకస్ లాటిదేనండీ షాపంటే ఎట్టేడుగాని ముందల బల్లెట్టుకోడానికి పార్కింగ్ స్థలం ఎక్కడుందండీ – అంచేత స్కూటర్లకి అదే బిల్డింగ్లో పై అంతస్తులో పార్కింగ్ పెట్టేడండి."

"పై అంతస్తులో పార్కింగా!" ఈ మాటు ఆశ్చర్యపోవడం సుందరం వంతయింది.

"పక్క బిల్డింగూ అడిదేనండీ. దాన్ని కాస్త మార్చి దాని చుట్టూ బళ్లు తిరిగి పైకెళ్ళేట్టు స్లాబు వేయించేడండి" అన్నాడు ఆటోడ్రైవరు.

సర్కసుల్లో గ్లోబులోని మోటర్ సైకిల్ ఫీట్స్లా ఉందా దృశ్యం. అందరూ తమ తమ మోటార్ సైకిళ్ళనీ స్కూటర్లనీ రన్వే లాంటి ఆ బిల్డింగ్ చుట్టూ తిప్పి పై అంతస్తుకి తీసుకుపోతున్నారు.

"బతికుంటే ఏ మడిబట్టో కట్టుకు తిరుగుతానుగానీ నా వల్ల కాదు ఆ ఫీట్సు చేయడం.

కింద పడ్డానంటే ఇన్సూరెన్స్ కూడా లేదు. పిల్లలు కూడా చిన్నవాళ్ళే. నువ్వొక్కతెవీ ఎలా బతుకుతావో! పోనీ.... డబ్బులిచ్చేస్తాను. బట్టలేవో నువ్వే కొనుక్కుని ఆటోలో వచ్చేయ్. నేనింటికి పోతాను" అన్నాడు సుందరం.

"పండగ బట్టలు... మీరు లేకుండా ఎలాగండీ. పోనీ ఆ పక్క సందులో మా అత్తయ్య కూతురుంది. వాళ్ళింట్లో స్కూటర్ పెట్టేసి వెళ్తేనో" అంది జానకి.

"వాళ్ళింట్లో స్కూటర్ పెడితే వాళ్ళకి కన్పించకుండా రాలేం కదా. ఆవిడ చూసిందంటే లోపలికి పిల్చి కాఫీ యిస్తుంది"

"మనకేనేమిటి. ఎవరెళ్ళినా వాళ్ళింట్లో ఆ అతిథి మర్యాదలు తప్పవ్"

"అందుకే వద్దన్నది. నేను వాళ్ళింట్లో కాఫీ తాగలేను. అంతకంటే ఆ సర్కస్ ఫీటే నయం" అన్నాడు సుందరం.

"పోనీ ఆ పక్కనున్న ఒటేలు కాడ కాపీ తాగేసి అక్కడెట్టేయండి బండి" అంటూ ఓ ఉచిత సలహా పారేశాడు ఆటోడ్రైవరు.

"అవునండీ అలా చేద్దాం" అంది జానకి.

"ఎవరేది చెబితే అలా చేసేయడమేనా? ఆ డొక్కు హోటల్లో కాఫీ మీ అత్తకూతురిచ్చే కాఫీకేం తీసిపోదు గానీ ఆ పక్కన యీ మధ్యే బోర్డు తిప్పేసిన చిట్‌ఫండ్ కంపెనీ ఒకటుండాలి. దాని ముందు పెడతాను పద" అంటూ అక్కడ దాకా స్కూటర్ నడిపించి అక్కడున్న బురద, రాళ్ళు లేని మట్టి జాగాలో స్టాండు వేయబోయాడు. కానీ ఎత్తు పల్లాల మూలంగా స్టాండు పడలేదు. సరిగ్గా అప్పుడే ఓ నల్లటి కుర్రాడు పరిగెత్తుకొచ్చి స్కూటర్‌ని పట్టుకుని స్టాండు వేయడంలో సాయపడ్డాడు - 'దేవుడిలా వచ్చేవు. నీ పేరెంటీ" అడిగేడు సుందరం. "దేవుడండీ" అంటూ టిక్కెట్టు పుస్తకంలో ఓ టిక్కెట్టు చింపి చేతికందించాడు వాడు.

"ఇదేమిటి? పేరు చెప్పడానికీ ఫీజే"

"పార్కింగ్ ఫీజండి. రెండు రూపాయలు" అంటూ బోర్డు చూపించేడు వాడు. మున్సిపాలిటీవారు పార్కింగ్ కోసం కేటాయించిన స్థలం అది.

"నువ్వే చూశావుగా ఎంత సదునుగా సదుపాయంగా వుందో ఇక్కడ పార్క్ చేస్తున్నందుకు న్యాయంగా వాళ్ళే రూపాయో అర్థో మాకు ఇవ్వాలి" అంటూ రెండు రూపాయలు తీసి వాడి చేతిలో పెట్టి ముందుకు కదిలాడు.

కాస్త దూరం నడిచి సుందరం, జానకి బట్టల దుకాణం వాడి క్యూలో నిల్చున్నారు. షాపు గుమ్మంలో నిల్చున్న జవాను పదేసి మందిని లోపలికి పంపించి పదేసి నిముషాలు ఆపేస్తున్నాడు. సుందరం, జానకి గుమ్మం దగ్గరకు వెళ్ళే సర్కే గంట దాటిపోయింది. 'మోక్ష గుమ్మం' దాటేం అన్నాడు సుందరం గుమ్మం దాటుతూ. అది దాటి కుడి వైపు తిరిగితే అక్కడొక పెద్ద హాలుంది. అక్కడ అందరూ తమతో తెచ్చిన వస్తువుల్నీ, బేగుల్నీ అక్కడున్న అరల్లో పెట్టేసి టోకెన్లు తీసుకుంటున్నారు. వేసుకున్న జోళ్ళు పెట్టడానికి కూడా అక్కడ గూళ్ళున్నాయి. అక్కడా టోకెన్ సిస్టమే. "ఇదంతా చూస్తుంటే తలనీలాలు సమర్పించే స్థలం కూడా యిక్కడెక్కడో వుండే వుంటుంది" అన్నాడు సుందరం. జానకి అతని వేపు

ఎర్రగా చూసి ముక్కు మీద వేలేసింది.

"అమ్మో లోపల రద్దీగా ఉంటుంది. దొంగలుంటారు. మీ విలువైన వస్తువులు, నగలు పెట్టాలనుకున్నవారికి యిక్కడ ఫ్రీగా లాకర్ సదుపాయముంది" అనే అర్థమొచ్చేట్టు అక్కడున్న మరో జవాను అరుస్తున్నాడు.

వడ్డాణాలూ, నెక్‌లేసులూ, ఎత్తు గొలుసులూ, కాసుల పేర్లూ మొదలైన నగలు దిగేసుకొచ్చిన వాళ్ళంతా మొదట దిగాలు పడిపోయినా ఆనక లాకర్లు తీసుకుని అందులో పెట్టేస్తున్నారు.

"నీ చెవులకున్న దుద్దులు కూడా తీసి లాకర్లో పెట్టేయ్. మా కంపెనీ వాళ్ళిచ్చిన మొదటి బోనస్‌తో కొన్నవి. దొంగలు కొట్టేశారంటే మళ్ళీ కొనలేను" అన్నాడు సుందరం.

"ఛా. ఏవో జాగ్రత్తలు చెబుతున్నారుగాని మరీ అంత ఘోరమా" అంది జానకి.

"ఏమో! దొంగలు వుండొచ్చనటం లేదు – దొంగలుంటారని ఖచ్చితంగా చెబుతూంటేనూ" అన్నాడు సుందరం. ఆ మాటకి జానకి నవ్వలేదు గాని ఆ పక్కాయనెవరో భళ్ళున నవ్వేడు.

కాస్త ముందుకు వెళ్ళేక దిగుడు బావి కున్నట్లు కిందికి మెట్లున్నాయి. అక్కడ వెలుగు కూడా తక్కువగానే ఉందేమో నిజంగా దిగుడు బావిలోకి వెళ్తున్నట్లే అనిపించింది సుందరానికి. జానకికి మాత్రం అంతా ఆశ్చర్యంగా, వింతగా ఉంది. అటు పక్క చూస్తే ఒక లిఫ్టు కిందికి వెళ్తోంది. "అయ్యో, లిఫ్టు కూడా ఉంది మనం చూళ్ళేదు" అంది జానకి. సుందరం మాట్లాడలేదు. కొన్ని మెట్లు దిగేక కళ్ళు జిగేల్మనిపించే ఒక హాలు వచ్చింది. అక్కడ చిన్న చిన్న ప్లాస్టిక్ గ్లాసులతో డ్రింక్స్ సర్వ్ చేస్తున్నారు.

"మేమింకా ఏమీ కొన్లేదు. ఫర్వాలేదా" అడిగేడు సుందరం గ్లాసందుకుంటూ.

"మా కస్టమర్లందరికీ యిది ఉచితం" అన్నాడతడు అతి మామూలుగా.

"ఇంతకీ షాపెక్కడ?" జానకి ఆత్రానికి అతగాడు నవ్వి, "చీరలా? ఇలా లోనికి వెళ్ళి కుడివైపుకు తిరగండి" అన్నాడు.

అతను చెప్పినట్లే వెళ్ళారు. ఆ విభాగంలో చీరలూ, ఆడవాళ్ళకి పనికొచ్చే డ్రస్ మెటీరియల్ వున్నాయి. అక్కడే ఒక ప్రక్కన నేల మీదున్న పరుపుల మీద చీరలు గుట్టలు గుట్టలుగా వున్నాయి. వాటి చుట్టూ జనమే. జానకి వాటి వేపు తొంగి చూడబోయింది.

"అవి జరీ చీరలమ్మా. మీకే రకం కావాలి?" అడిగేడు అక్కడున్న ఒకతను. జానకి ఏ సమాధానమూ యివ్వకపోయే సరికి, "పట్టువైతే అటున్నాయి" అంటూ రెండో వైపు చేయి చూపించేడు. అతని జేబు మీద షాపు సూపర్‌వైజర్‌గా గుర్తింపు కార్డు ఉంది.

అటు చూసింది జానకి. అక్కడ అద్దాల బల్లల మీద చీరలు మడతలుగా పేర్చి వున్నాయి. ఎదురుగా అందమైన కుర్చీలు. వాటికి సరిపడా జనమే! అటు వైపు దృష్టి సారిస్తూనే తనకేం కావాలో చెప్పింది జానకి. అతను మరోవైపు చేయి చూపించేడు.

అక్కడ ఆడా మగా దేని చుట్టూనో గుంపుగా వుండి చీరల్ని బయటకు లాగుతున్నారు.

"నువ్వెళ్ళి ఎంచుకో. నేను రాలేను" అన్నాడు సుందరం.

జానకి నలుగుర్నీ తోసుకుంటూ ఎలాగోలా లోపలికి వెళ్ళింది. అక్కడ ఓ పెద్ద కుండీ లాంటి దాంట్లో చీరలు పడేసి వున్నాయి. "ఏ చీరైనా ఆరొందలే" అనే బోర్డు ఓ కర్రకు దిగ్గొట్టి మధ్యన పాతేశారు. చుట్టూ వున్న వాళ్ళు ఎవరికి నచ్చిన చీరని వాళ్ళు నూతిలోంచి నీళ్ళు తోడుతున్నట్లుగా ఐదు మీటర్ల చీరల్నీ లాగుతున్నారు. కొందరు చీరల్ని లాగబోయి వారే అందులో పడిపోయారేమో. వాళ్ళని కొందరు బయటకు తీస్తున్నారు. నాలుగైదు చీరల్ని తోడి చూసింది జానకి. ఎవరెవరో కట్టుకుని విప్పేసి పడేసినట్లుగా వున్నాయవి.

వెంటనే బయటకొచ్చేసిన జానకి వంక ఆశ్చర్యంగా చూస్తూ –

"ఏం? తీసుకోలేదా?" అడిగేడు సుందరం.

జానకి ఏం మాట్లాడలేదు. చెత్తకుండీలో చిత్తు కాగితాలేరుకునే వాళ్ళు గుర్తుకొచ్చారతనికి. అక్కడున్న వాళ్ళలో కొంతమంది, 'ఆలసిస్తే ఎవరేనా కట్టుకుపోగలరు' అన్నట్టుగా రెండేసి, మూడేసి చీరలు భుజాల మీద వేసుకుని వస్తున్నారు.

"అక్కడే కౌంటర్లో ఫుల్‌వాయిల్ చీరలు అడుగుదాం పదండి" అంటూ దారి తీసింది జానకి. అంతా విని, అడిగినవి చూపించకుండా 'కట్టుకుందాం రా' అనే కొత్తరకం చీరలొచ్చాయని చూపించాడతను. చీరపై ముప్ఫయ్ శాతం డిస్కౌంట్ వుంది! ఇంకా లంగా బట్ట కూడా ఉచితమట.

"పని మనిషెలాగూ పాత చీర అడుగుతుందిగా. దాని అదృష్టం ఎలా ఉంటే అలాగే ఉంటుంది. తీసేస్కో" అన్నాడు సుందరం.

"బావుంది. చీర నాకా దానికా?" అని కోపంగా చూసి తనకు నచ్చిన చీరే ఓ వంద ఎక్కువైనా ఫర్వాలేదన్నట్టు తీసుకుంది.

అక్కడ నుంచి బయటపడి వస్తుంటే వరస కౌంటర్లు!

లంగాలు కొంటే రుమాలు ఉచితమనీ, జాకెట్ పీస్ కొంటే శారీ ఫాల్ ఉచితమనీ, ఫాల్ కొంటే జాకెట్ హుక్స్ ఉచితమనీ బోర్డులు!

మిగతావి తర్వాత కొనుక్కోవచ్చని జానకి చెయ్యి పట్టుకుని నడిపించుకొచ్చేడు సుందరం. మళ్ళీ మరో కొన్ని మెట్లు దిగేక అక్కడ పిల్లల బట్టలూ, మగవారి బట్టలూ రెండు విభాగాలుగా చెరో పక్క వున్నాయి.

పిల్లల బట్టలు కొంటే కూపన్లేవో యిచ్చేరు. అలాంటి కూపన్లు ఓ మూడు యిస్తే చాక్లెట్లు యిస్తారట ఏ షాపులోనైనా.

'ఏ షర్టయినా 40 రూపాయలే!' అనే బోర్డున్న కౌంటర్ దగ్గర జనం తోసుకుంటున్నారు. తుఫాన్లో యిళ్ళు నేలమట్టమై సర్వం కోల్పోయిన జనం హెలికాప్టర్లలో వచ్చే పాత బట్టల కోసం ఎగబడిన దృశ్యం కళ్ళ ముందు నిలిచింది సుందరానికి. యాభై ఏళ్ళు పైబడిన ఒకాయన 40 రూపాయలు సేల్స్‌మెన్ చేతిలో పెట్టి అతను తొడుక్కున్న చొక్కా లాంటిది యిచ్చేయమంటున్నాడు.

"భలేవారే. ఇది సేల్‌కి కాదు. ఢిల్లీ నుంచి తెప్పించుకున్నాను" అంటున్నాడతను. సుందరానికి నవ్వాలో ఏడ్వాలో తెలియక ముఖం అదోలా పెట్టేడు. అది గమనించిన

జానకి, "పోన్లెండి మీ చొక్కా మరో చోట కొనుక్కుందురుగాని. మనం యిక వెనక్కు వెళ్దామా" అంది.

"యీ షాపులో ముందుకే గాని వెనక్కు వెళ్ళేందుకు లేదుగా" అన్నారెవరో.

"అన్నట్టు... మనం కొన్న చీర బిల్లు చూపిస్తే రెండు సినిమా టిక్కెట్లు ఫ్రీగా యిస్తారట. తీసుకువెళ్ళమన్నాడతగాడు" అంది జానకి.

'బయటకు దారి' అనే బాణం గుర్తు వున్న దారి గుండా వెళ్ళబోతూ ఎదురుగా ఓ కౌంటర్ దగ్గర జనం విపరీతంగా ఉంటే తోసుకుంటూ ముందుకు వెళ్ళేడు సుందరం.

"ఎప్పుడు కొన్నారు మీరు?" అడిగేడు కౌంటర్లోని అతను.

"ఎప్పుడో ఏమిటి. ఇప్పుడే" అన్నాడు సుందరం.

"వెళ్ళవయ్యా. జోకులా" చిరాగ్గా తల తిప్పేసుకున్నాడతను.

"జోకులు కాదు బాబూ. నిజమే. ఇదిగో బిల్లు" చూపించేడు.

"నెల క్రితం, వారం క్రితం కొన్నవాళ్ళు యివాళ తీసుకొస్తూంటే... అప్పుడే ఎక్కడ చూశావ్. వెళ్ళు వెళ్ళు" అంటూ జబ్బ పట్టుకు తోసేశాడు.

బయటకొచ్చేకెవరో అన్నారు.

"ఆ కౌంటర్లో రిటన్ చేసే బట్టలు తీసుకుంటారు. అంటే మొదటి ఉతుక్కే రంగులు పోయినవీ, షింకయినవీ, జాడలిచ్చేసినవీ ఉంటాయిగా వాటిని తెస్తే బిల్లు చూసి తీసుకుని కొన్నిటిని మార్చి కొత్తవిస్తారు. కొన్నిట్ని కంపెనీకి పంపిస్తారు."

సినిమా టిక్లెట్లిచ్చే కౌంటరెక్కడో అడిగి టిక్కెట్లు తీసుకున్నాడు సుందరం.

అప్పటికి టైం ఎనిమిదిన్నర దాటేసింది. ఎలాగో లిఫ్టులో బయటకొచ్చి చూస్తే షాపు ఎంట్రన్స్‌కీ బయట కొచ్చిన గేటుకీ మధ్య ఫర్లాంగు దూరముంది.

"ఇప్పుడు యింటికెళ్ళి వండి పెట్టే వరకూ పిల్లలు ఆకలికి ఆగలేరు. ఈ పూటకేదైనా హోటల్లో కొని పట్టుకుపోదాం" అంది జానకి నెమ్మదిగా.

"సార్. సార్. మీరు సిన్మాకెళ్ళకపోతే టిక్కెట్లిచ్చెయ్యరా" అడుగుతున్నాడో చారల బనీను వేసుకున్న కుర్రాడు.

"ఇవ్వం. మేమే చూస్తాం" అంది జానకి కోపంగా.

వెనక్కు వచ్చి జోళ్ళు తీసుకుని స్కూటర్ వైపు నడుస్తూ షాపు వంక ఓ మారు చూశాడు సుందరం.

'ద్రౌపదీ వస్త్రాలయం' అనే బోర్డు రంగు రంగుల దీపాల మధ్య వెలిగిపోతోంది. బోర్డుకు ఒక పక్క కృష్ణుడు అభయాస్తమిస్తూ చీరలు సప్లై చేస్తున్న బొమ్మ వుంది. బహుశః రెండో వైపు ద్రౌపది వుండొచ్చు. కానీ సుందరం అటువైపు చూడలేదు!

*రచన మాసపత్రిక – నవంబర్, 2002*

*తెలుగు వెలుగు (న్యూయార్క్) – స్వభాను ఉగాది ప్రత్యేక సంచిక – ఏప్రిల్, 2003*